# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [5]

~ అద్దంకి అనంత రామయ్య



**సీరియల్:** సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [5]

**రచన:** అద్దంకి అనంత రామయ్య

**ప్రచురణ:** కినిగె పత్రిక patrika.kinige.com

**కాలం:** ఫిబ్రవరి 2014

**శాశ్వత లింకు:** http://patrika.kinige.com/?p=1564

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [5]

*అత్యధికంగా అమ్ముడుపోయిన ఈ-పుస్తకంగా పేరు తెచ్చుకున్న "రామ్@శృతి.కామ్" రచయిత అద్దంకి అనంతరామయ్య రాసిన రెండవ హాస్య నవల ఈ "సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం". దీన్ని వారం వారం సీరియలైజ్ చేస్తున్నాం.* ***ఇది ఐదవ భాగం.***

దీని ముందుభాగం

అజయ్, గుప్తా, వేణు, వెంకటరావు, రాజుగారు అంతా గుప్తా షాపు లోపలికి చేరారు. అప్పటికే సమయం తొమ్మిది కావస్తున్నది. "అన్నీ సర్ది షాపు మూసేయరా" అన్నాడు గుప్తా, పని చేసే కుర్రాడితో. అతను అలాగే చేసి వెళ్ళిపోయాడు. "ఇంక సభ మొదలు పెడదామా?" అన్నాడు వేణు. కొత్త పేకలని బయటకు తీస్తూ. "మనమేనా? ఇంకా రావాల్సిన వాళ్ళు ఎవరైనా ఉన్నారా?" అన్నాడు రాజుగారు. "పంతులు గారు వస్తానన్నారు, ఒకసారి ఫోను కలిపి చూడు" అని గుప్తా అనటంతో, రాజు గారు ప్రయత్నించి చూశాడు. కాని అవతలివైపు నుండి సమాధానం లేదు. "మనం మొదలు పెడదాం, పంతులు గారు మధ్యలో వచ్చి కలుస్తారు" అని వేణు అనటంతో అంతా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించటానికి సిద్ధపడ్డారు.

పట్టణాలలో అయితే పెద్ద పెద్ద భవంతులలో, పెద్ద నిలువుటద్దాలతో, ప్రయత్నపు గదులతో, పలు రకాల బ్రాండులతో అట్టహాసంగా ఉంటాయి. కానీ ఊర్లల్లో ఉండే బట్టల షాపులకు అన్ని ప్రత్యేకతలు ఉండవు. మెత్తని, తెల్లని వెడల్పాటి పరుపులను పరిచి ఉంచుతారు. బహుశా చీరలు కొనే ఆడవాళ్ళకి సౌకర్యం కోసం కాబోలు. కొనటానికి వచ్చిన వాళ్ళని మెత్తగా పరుపులమీద కూర్చోబెట్టి, అంతకంటే మెత్తగా డబ్బులు గుంజుతారనేది ఒక వాదన. ఈ పరుపులే వీరికిప్పుడు క్రీడా మైదానాలు. ఆ పరుపుల మీద అంతా వృత్తాకారంలో కూర్చున్నారు. తలుపులన్నీ మూసేసి, ఫ్యాన్లు, లైట్లు వేసి ఆట మొదలు పెట్టారు. వేణు ముక్కలన్నింటిని కలుపుతూ ఉన్నాడు.

"నేను ప్రధానమంత్రి అయితే, పేకని ప్రపంచ క్రీడ చేస్తాను" అన్నాడు రాజుగారు. "పుట్టే పిల్లాడు పి.టి ఉషలా పరిగెత్తాలని, పురిటి నొప్పులు పడుతూ టెంపుల్ రన్ ఆడిందని, అస్సలు ఒక్క ఎన్నికల్లో కూడా నిలబడకుండానే ప్రధాని పదవి దాకా వెళ్ళావే" అన్నాడు వేణు నవ్వుతూ. దీనితో అందరూ ఒక్కసారిగా నవ్వారు. "ఇంతింత ఖర్చుపెట్టి కొట్టు కట్టారు, క్రీడాకారులకోసం కనీసం ఏ.సి అయినా పెట్టించరెందుకో?" అన్నాడు వేణు. "ఏ.సి ఎంతసేపురా? నీ లాంటోళ్ళంతా, తీసుకున్న డబ్బులు సమయానికి, సరిగ్గా ఇస్తే ఈ పాటికి నాలుగు ఏ.సి లు పెట్టించచ్చు" అని అంటూ గుప్తా తన ముందు వేణు వేస్తున్న ముక్కలు ఒక్కోటి తీసుకుంటూ అన్నాడు.

"ప్రతి ఆటకి, ప్రతి వాడికి పదమూడేసి ముక్కలు పంచాలంటే చికాకుగా ఉంది. అదేదో మూడుముక్కలాటట, అది నేర్చుకుని, ఆడటం మొదలు పెడదాము" అన్నాడు వేణు. "ఇంకా నయం కొట్లో పని చేసే కుర్రాడినొకడిని ముక్కలు వేయటానికి పెట్టుకుందామనలేదు" అన్నాడు అజయ్. "ఎంతైనా చదువుకున్నోడు చదువుకున్నోడే, ఈ ఆలోచన ఏదో చాలా బాగున్నదే" అన్నాడు రాజుగారు. "ఊరుకోండి రా! మనం ఇక్కడ పేకాటాడుతున్నందువల్లనే, వ్యాపారం సరిగ్గా సాగటంలేదని మా నాన్న తిడుతున్నాడు. మీరు మళ్ళీ ఇలాంటి క్రొత్త క్రొత్త పత్తి వ్యాపారాలు పెట్టకండి" అనటంతో అంతా నవ్వారు, ఒక అజయ్ తప్ప. "అంటే మనం ఇక్కడ పేక ఆడుతున్నామని మీ నాన్నకి తెలుసన్నమాట" అన్నాడు అజయ్ అమాయకత్వంగా కూడిన ఆశ్చర్యంతో. "నువ్వు సిగిరెట్లు తాగుతావని మీ నాన్నకు తెలియదనుకున్నావా?" అన్నాడు రాజుగారు. "తెలిసే సమస్యే లేదు" అన్నాడు అజయ్. "తెలిసినా సమస్య లేదా, మరి బ్యాంకుకు వెళ్ళిన ప్రతిసారి "మా వాడి చేత సిగిరెట్టు మాన్పించండయ్యా" అని మీ నాన్న నాతో ఎందుకంటాడు ?" అని గుప్తా అనటంతో అజయ్ ఖంగుతిన్నాడు.

"రాజకీయాల్లోనే కాదు ,ఆటలో కూడా నేనే రాజుని. ఇస్పేట్ రాజు వచ్చాడు, ఆట తెచ్చాడు, షో" అంటూ తన ముక్కలను అందరి ముందు పరిచాడు రాజుగారు.అందరూ తమ తమ కౌంటు ఎంత వేయాలో చెప్తుంటే ,గుప్తా ఒక చిన్న కాగితం లో అవన్నీ రాస్తున్నాడు. "ఇక్కడ కూడా వడ్డీ వేస్తావా రా"

అన్నాడు వేణు, గుప్తాని ఉద్దేశించి. “ఏంటి క్షణం ఆలస్యం అయ్యానో లేదో, అప్పుడే మొదలు పెట్టేశారా?” అంటూ లోపలికి వస్తూ అన్నాడు పంతులు గారు. పైన ఒక తెల్లని జుబ్బా, దానిమీద ఒక ఉత్తరీయం, క్రింద పంచ, నెత్తిన పిలక, నుదుటన అడ్డంగా విభూతి రేఖలు, పావలా బిళ్ళంత బొట్టు, మొత్తానికి బ్యాటు పట్టుకున్న సచిన్లా నిండుగా ఉన్నాడు. చూడగానే చెప్పేయచ్చు, ఇతను గుడిలో పూజారని, లేదా పురోహితుడని (రెండిటికీ తేడా ఏంటని అడక్కండి).

అందరూ ఆట నుండి అరక్షణం బయటకు వచ్చి అతనివైపు చూశారు. “రండి పంతులు గారు, మనం సినిమాకి ఆలస్యంగా వెళ్తే, మనకోసం మొదటినుంచి వేస్తారా? మనం వెళ్ళిన దగ్గర నుంచి చూడాల్సిందే. పేకైనా అంతే ! క్షణం ఆలస్యం చేస్తే గంట భాద పడాల్సి వస్తుంది., రండీ ! రండీ !” అని గుప్తా లేచి కొంచెం పక్కకు జరిగాడు. గుప్తాకి, అజయ్ కి మధ్యలో కూర్చున్నాడు. “ఎప్పుడు వచ్చావు అజయ్?” అని అజయ్ భుజాన చెయ్యి వేసి అడిగాడు. “వాడికేమి పంతులుగారు, రావాలి అనిపించినప్పుడు వస్తాడు., వెళ్ళాలి అనిపిస్తే వెళ్తాడు. మేమూ మనుషులమే, మమ్మల్ని కూడా కాస్త పట్టించుకోండి” అన్నాడు వేణు. “నిన్ను పట్టించుకోకపోతే దేశానికి వచ్చే దరిద్రం ఏమి లేదు . ముక్కలు కలుపు” అని గుప్తా అనటంతో, ముక్కలు కలిపి గుప్తా చేతికి ఇచ్చాడు.

ఆ ముక్కలు కలిపేటప్పుడు వచ్చే శబ్దం ,కాఫీ తిరగ్గొట్టేటప్పుడు వచ్చే శబ్దానికి దగ్గరగా ఉంటుంది. ఒకరకంగా చెప్పాలంటే పేకాట ! ఒక మంచి కాఫీ లాంటి ఆట. అలవాటు పడినోళ్ళు ఆడకుండా ఉండలేరు, అచ్చు కాఫీలానే. క్రికెట్ లో రన్ అవుట్ అప్పుడు బాలు, బెయిల్స్ గాలిలో ఉంటే అవుటంటారు ,పేకాటలో లైఫు, జోకరు రాకపోతే డ్రాపు అంటారు. అజయ్ ఆట డ్రాపు అని తన ముక్కలను క్రింద పడేసి, పంతులుగారి వైపుకి జరిగి, ఆయన ముక్కలను పరీక్షగా చూస్తున్నాడు. ఒక్కసారిగా నిశబ్ధం ఆవరించింది. అంతా శ్రద్ధగా ఆడుతున్నారు. “ఆహా జోకరొచ్చింది, ఆట అయ్యింది, అలా రావాలి ముక్కలంటే” ఆ నిశబ్దాన్ని చేదిస్తూ తన ముక్కలన్నీ చూపించాడు వేణు. గుప్తా అందరి కౌంటు వేస్తుండగా అజయ్ ముక్కలు కలపటం మొదలుపెట్టాడు. “ఏ మాటకామాట!

జోకరొచ్చినప్పుడొచ్చే ఆనందం, ఎన్ని జోకులేస్తే వస్తుంది పంతులుగారు?" అన్నాడు వేణు, పంతులుగారిని చూసి కన్ను కొడుతూ. "నిజమే ,కాకపోతే అన్నీ ఉండి లైఫ్ లేకపోతేనే ఇబ్బందిగా ఉంటుంది" అంటూ అజయ్ పంచిన ముక్కలని ఒకొక్కటి తీసుకోవటం మొదలు పెట్టారు.

"దేవుడు ఏమంటున్నాడు పంతులుగారు?" అన్నాడు రాజుగారు. "నీకు డబ్బులు పోవటం మాత్రం ఖాయం అని చెప్పమన్నాడు" అన్నాడు వేణు వెటకారంగా. "నన్ను అడిగే బదులు, వారానికోపూట చక్కగా గుడికి వచ్చి, దక్షణ ఇవ్వకపోయినా పర్వాలేదు దండం పెట్టుకుపోవచ్చు కదా!" అన్నాడు పంతులు గారు. "రావాలని మాకు మాత్రం ఉండదా? మేము వచ్చి గుడిని అపవిత్రం చేయటం ఎందుకులే అని రావటం లేదు పంతులుగారు. పై పెచ్చు ఈ ప్రజా జీవితంలో మాకు ప్రజలే దేవుళ్ళు కదా" అన్నాడు రాజుగారు. "అందుకేనా అభివృద్ధి చేయమని ఇచ్చే డబ్బులు, ప్రసాదంలా మాకు చూపించి, మొత్తం మేరే మింగేస్తున్నది" అని వేణు అనటంతో రాజుగారు ముఖం రంగు మారింది.

"గుడిలో పూజారిగా చేయటం కన్నా ఏ కొట్లోనో గుమాస్తాగా చేసినా బాగుండు. కాసులు రాకపోయినా, కనీసం కన్యనివ్వటానికైనా ఎవరో ఒకరు ముందుకొచ్చేవారు. ఇప్పుడు కన్యను అడుగుతుంటే కనుచూపు మేరలో ఉండకుండా పారిపోతున్నారు. నలుగురికి పెళ్ళిళ్ళు చేయటానికే తప్ప, ఒక్కళ్ళని కూడా చేసుకోవటానికి పనికి రాకుండా పోతున్నాము" అని పంతులుగారు అన్నారు. ఆ గొంతులో భాద అందరికి స్పష్టంగా అర్ధం అయ్యింది. "కొట్లో గుమస్తాకేంటండి? యజమానులకే పెళ్లి కాక చస్తుంటే! ఎవరిని అడిగినా, సాఫ్ట్ వేర్, ఆరడుగులు, ఆరేడు లక్షల జీతం, అమెరికా సంభందం అంటున్నారు. ఇంక అద్దంకిలో ఉండే మనకు అయినట్టే పెళ్లి", అని గుప్తా అజయ్ వైపు గుర్రుగా చూశాడు. "నీకు సాఫ్ట్ వేరోళ్ళంటే ఎందుకు పడదో నాకు ఇప్పుడు అర్ధం అయింది" అన్నాడు వేణు, గుప్తా వైపు చూసి నవ్వుతూ.

“ఏరా మాకు పెళ్ళిళ్ళు కానివ్వరా?” అన్నాడు గుప్తా. “నేనేదో నీకొచ్చే సంబంధాలన్నీ చెడగొొడుతునట్టు మాట్లాడుతున్నావేరా?” అని అజయ్ బదులు ప్రశ్నించాడు. “సంబంధాలు వస్తే కదా రా నువ్వు చెడగొొట్టటానికి. అంతా సాఫ్టోళ్ళే తన్నుకు పోతుంటే. ఊర్లో అందరికీ చీరలమ్మే నేను, జీవితంలో నా భార్యకి చీర కొనిపెట్టలేనేమో” అన్నాడు గుప్తా. “మాది చీరలకొట్టు, వచ్చే ప్రతి చీర, నువ్వు కట్టుకున్నాకనే అమ్ముతాను, అని స్టేట్ మెంట్ ఇవ్వు. రోజుకో కొత్త చీర ఆఫరిస్తే, నీకు ఒకటేంటి, రెండు మూడు పెళ్ళిళ్ళు అవుతాయి” అన్నాడు రాజుగారు. “అస్సలే ఇప్పుడు అమ్మాయిలు తక్కువున్నారు అంటున్నారు. మనమేదో ఇరగాదీస్తామని, అబ్బాయిలు కావాలి, అబ్బాయిలు కావాలి అని అబార్షన్లు చేయించారు, ఇప్పుడు మనం అనుభవిస్తున్నాము” అని పంతులుగారు అన్నారు. “ఇంటర్ తప్పిన అమ్మాయికి కూడా ఇంజనీర్ కావాలంటే ఎలా చావమంటారు?” అన్నాడు రాజుగారు. “అబ్బే ఈ జన్మకి పేకకి తప్ప పెళ్ళికి మనం పనికిరాములే” అని రాజుగారు అన్నాడు.

మళ్లీ పేకాట ఊపందుకున్నది. “ఈ సారి ఎవరు గెలుస్తారంటారు రాజుగారు?” అడిగాడు అజయ్. “పేకలోన? స్టేట్ లోన?” అని అడిగాడు. “స్టేట్ లో” అన్నాడు అజయ్, “ చెప్పలేము, ప్రజలు పేకలాంటోలళ్ళు బాగా ముక్కలు మనకు పడుతున్నాయి అని ఆనందపడితే, పక్కనోడికి మనకన్నా బాగా పడతాయి”, అన్నాడు రాజుగారు. “చివరికి మా జీవితాలని జూదమాడేస్తున్నరన్నమాట?” అన్నాడు వేణు. “మా ప్రభుత్వం వస్తే మాత్రం, అందరికీ మంచి రోజులు రావటం ఖాయం” అన్నాడు కాలర్ ఎగరేస్తూ. “ చెప్పేవారు చాగంటి వారైతే, వినేవాడు వినయ సంపన్నుడయి ఉంటాడని” సామెత. నీ గురించి ఎంతైనా చెప్తావు,నమ్మే వాళ్ళుంటే” అని అన్నాడు పంతులుగారు.

“ఎవరండి ఈ చాగంటి గారు? ఈ మధ్య ఎక్కువగా టి.వీ లలో వినిపిస్తున్నారు, కనిపిస్తున్నారు?” అన్నాడు వెంకటరావు. “మహానుభావుడయ్యా, ఆయన వాక్కు వేదవాక్కనుకో , అనుకోవటమేంటి? వేదవాక్కే” అన్నారు పంతులుగారు. “ఆ_ _ _.ఇవాళ,రేపు చెప్పేవాళ్ళు ఎక్కువైపోయారండి. ఏవేవో చెప్తారు, ఏలు ముంచే బాబాలు, ఎగిరి తన్నే బాబాలను, కోట్లు మింగే

స్వాములను ఎంతమందిని చూడలేదు? జనాల అమాయకత్వం వీళ్ళకు కలిసొస్తుంది" అన్నాడు వేణు. "ఎవరో కొంతమంది అలాంటివారున్నారని, అందరినీ ఒకే గాటికి కట్ట కూడదు వేణు బాబు. పైసా డబ్బులు తీసుకోరు, మాయలు మహిమలు ఏమి లేవు , కేవలం ధర్మ ప్రచారం తప్ప. అస్సలు ఆయన రామాయణం చెబుతుంటే, మన కళ్ళముందే రాములవారు తిరుగుతున్నట్టు ఉంటుందంటే నమ్ము" అన్నారు పంతులుగారు. "ఇవాళ రేపు పైసా తీసుకోకుండా ఉన్నారంటే ఆలోచించాల్సిందే!" అన్నారు రాజుగారు. " ఈయన పేరుమీద ఒక వెబ్ సైట్ కూడా ఉంది అక్కడ ప్రవచనాలన్నీ ఉచితంగా వినొచ్చు" అన్నాడు పంతులుగారు.

"మీతో ఇదే పేచీ పంతులుగారు, పేకకని పిలిచాం, ఆధ్యాత్మికం అన్నమాట వింటే చాలు అరగంట పాఠం చెప్తారు" అన్నాడు వేణు. "కుర్రాళ్ళు, తప్పక అలాంటివి వినాలయ్యా", అన్నాడు పంతులు గారు. అంతా సరే అన్నారు. "ఈ మధ్య మంత్రాలు ఎందుకు పనికొస్తున్నాయంటే, సినిమా వాళ్ళు బ్యాక్ గ్రౌండ్ మూజిక్ లో వాడుకోవటానికి పనికొస్తున్నాయి. హీరో, విలన్ని భయంకరంగా చంపే దృశ్యాలన్నింటిలోనూ, మంత్రాలను అర వీర భయంకరంగా వాడుతున్నారు" అని పంతులుగారు అనటంతో అందరూ ఒక్కసారిగా నవ్వారు. "ఇవాలేంటో ముక్కలు అస్సలు కలిసి రావటం లేదు, ఏమి చేయాలి పంతులు గారు?" అన్నాడు వేణు. "ఆడటం మానేయాలి" అని వెంటనే అన్నాడు గుప్తా.

"ఆధ్యాత్మికం అనే సరికి చిన్న అనుమానం వచ్చింది, పేకాట పాపం కాదా పంతులుగారు?" అని అజయ్ అడిగాడు. "అసలు పేక గురించి శాస్త్రాలు, చాగంటివారు ఏమైనా చెప్పారా?" అడిగాడు వేణు. "అవి రాసేనాటికి పేక పుట్టలేదు. పుట్టుంటే ధర్మరాజుగారు ఇంత మంచి ఆట కాదని గవ్వలాట ఎందుకు ఆడేవాడు, ఆడి ఎందుకు ఓడేవాడు. మనం కాసేపు సరదాగా ఆడే ఆటకు ఒళ్ళు నొప్పులు, కాళ్ళు నొప్పులు తప్ప, పాపం రాదులే", అన్నారు పంతులుగారు. "అంటే పేకాతురాణం న పాపం, న పుణ్యం అన్నమాట" అన్నాడు గుప్తా. "అసలు ఈ పేక వల్లనే కదా ! దేశంలో అ, ఆ లు రాని వాడు

కూడా అంకెలు వచ్చేది. అయినా ఈ పేకలో ఏముంది? పంతులుగారు? ఆడితే డబ్బులు పోవటం, ఆనక అలిసిపోవటం తప్ప" అన్నాడు అజయ్. "ఏదో పగలంతా పని చేసి ,సరదాగా ఆడుతున్నాము అంతే" అన్నాడు గుప్తా. "మా ఆఫీసులో కాకాని పెద్ద బాబు గారని, ఊర్లో పండక్కి వెళ్లి, పేకాటలో పాతిక వేలు పోగొట్టుకున్నాడట, ఆవారా కోడి పందెంలో బాగానే లాగాడనుకోండి అది వేరే సంగతి" అన్నాడు అజయ్. "అదే పేకలోని మహత్యం. మన స్తోమతని బట్టి పైసలకు ఆడినా, పదులకు ఆడినా, పది లక్షలకు ఆడినా, పొలాలు, పెళ్ళాలను, తాకట్టు పెట్టి ఆడినా పేక పేకే" అన్నాడు రాజుగారు.

"నేర్చుకునే తపన ఉండాలే గానీ, పేక నుంచి కూడా మనం ఎంతో నేర్చుకోవచ్చు. నువ్విప్పుడొక ముక్క ఎత్తుకున్నావు, అది తర్వాత ఆడే ఆటకి పనికిరావాలి, అలానే ఇవాళ నువ్వు చేసే పని రేపు నీ జీవితానికి ఉపయోగపడేలా ఉండాలి" అన్నారు పంతులుగారు. "పేక మీద మీకేవో లెక్కలు, పాఠాలు కూడా ఉన్నాయట కదా అజయ్" అడిగాడు పంతులుగారు. "ఆ ఉన్నాయి, కానీ మనం ఆడే ఆటలకి ,అక్కడి పాఠాలకి పొంతనే ఉండదు. ఆ లెక్కలు, ఆట ఆడినంత సులభం కాదు" అన్నాడు అజయ్. ఆట ఓ వైపు సాగుతూనే ఉన్నది. వేణుకి ఫోను రావటంతో మిడిల్ డ్రాప్ చేసి , ఫోను తీసి మెలికెలు తిరుగుతూ ప్రక్కకు వెళ్లి మాట్లాడటం మొదలుపెట్టాడు.

[తరువాయి భాగం వచ్చే వారం]

For Latest Telugu Books - Visit now:
Kinige
.com